సాక్షి
కుమురం భీం
ఆదివారం, 13, ఆగస్టు, 2023



ఈవీ'ఏం తెలుసు'..!

8లో▸

శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లపై అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తోంది.

ఫైనల్ జాబితా విడుదల

ఆసిఫాబాద్‌రూరల్: కేజీబీవీ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిలో సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ, నర్సింగ్, పీఈటీల నియామకం కోసం ఫైనల్ ప్రొవిజనల్ జాబితాను జిల్లా విద్యాశాఖ కార్యాలయం నోటీస్ బోర్డుపై అతికించినట్లు డీఈవో అశోక్ తెలిపారు. జాబితాలో పేరున్న అభ్యర్థులు ఈ నెల 13న మధ్యాహ్నం 12 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /26.3

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. గాలిలో అధిక తేమ కారణంగా ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి రెండుచోట్ల చినుకులు పడుతాయి.

న్యూస్‌రీల్

పంద్రాగస్టు అతిథులు వీరే..

కైలాస్‌నగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా జిల్లా కేంద్రాల్లో ఈ నెల 15న నిర్వహించే వేడుకల్లో పాల్గొనే ముఖ్య అతిథుల పేర్లను ప్రభుత్వం ప్రకటించింది. ఆదిలాబాద్ జిల్లాకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, నిర్మల్ జిల్లాకు రాష్ట్ర అటవీశాఖశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మంచిర్యాల జిల్లాకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు ఎమ్మెల్సీ సుంకరి రాజును కేటాయించింది. వీరు ఆయా జిల్లా కేంద్రాల్లో జరిగే పంద్రాగస్టు వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ప్రభుత్వ ప్రగతిపై ప్రసంగించనున్నారు. ఉత్తమ సేవలందించిన వివిధ శాఖల ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు.

మద్యం దుకాణాలకు 27 దరఖాస్తులు



దరఖాస్తు అందజేస్తున్న మహిళ

ఆసిఫాబాద్: జిల్లాలో మద్యం దుకాణాల కోసం శనివారం 27 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆసిఫాబాద్ డివిజన్‌లో 13, కాగజ్‌నగర్ డివిజన్‌లో 14 దరఖాస్తులు వచ్చాయి. దీంతో జిల్లాలో మద్యం దుకాణాల దరఖాస్తుల సంఖ్య 121కి చేరినట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి జ్యోతి కిరణ్ తెలిపారు.

'గ్రూపు-2 పరీక్షలు వాయిదా వేయాలి'

కాగజ్‌నగర్‌టౌన్: ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలను మూడు నెలలు వాయిదా వేయాలని, గ్రూప్-2 అభ్యర్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ శనివారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ కార్యదర్శి టి.భీమేష్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ గాంధీ చౌక్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భీమేష్ మాట్లాడుతూ ఈ నెల 23 వరకు గురుకుల బోర్డు పరీక్షలు, జూనియర్ లెక్చరర్ల పరీక్షలు ఉన్నందువల్ల గ్రూప్-2 పరీక్షకు విద్యార్థులకు సమయం సరిపోవడం లేదన్నారు.

వైద్యసిబ్బంది స్థానికంగా ఉండాలి



సబ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కౌటాల: వైద్య సిబ్బంది స్థానికంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని గుండాయిపేట్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 18న నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ బృందం సభ్యులు వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేయడానికి రానున్నట్లు తెలిపారు. సెంటర్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని సదుపాయలు అందుబాటులో ఉంచాలని సూచించారు. సెంటర్‌లో మరమ్మతులు చేయించాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎండీఏ కార్యక్రమాన్ని పరిశీలించారు. అందరికీ బోదకాలు నివారణ మాత్రలను వేయాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి నవత, సూపర్‌వైజర్ పావని, డీపీవో ధరంసింగ్, రషీద్ ఉన్నారు.

గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ జయంతి



సిబ్బందిని సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిబ్బందిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ప్రవీణ, సదానందం, వెంకటరమణ, రామయ్య, సలీం, దేవి, తదితరులు పాల్గొన్నారు.

అమృత స్వరాలు

వాట్సాప్ ప్లాట్‌ఫాంపై గాయకులు

- గ్రూపులో వివిధ ప్రాంతాలకు చెందిన 127 మంది సభ్యులు
- ప్రతీరోజు క్విజ్, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు
- నేడు జిల్లా కేంద్రంలో ఐదో వార్షికోత్సవం



అమృత స్వరాల గ్రూపు మహిళలు

సండే స్పెషల్

ఆసిఫాబాద్: వారంతా ఆసిఫాబాద్ ఆడపడుచులు. సరదాగా పాటలు పాడేందుకు ఐదేళ్ల క్రితం 'ఆసిఫాబాద్ అమృత స్వరాలు' పేరుతో ఓ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. గోదావరిఖనికి చెందిన కేశెట్టి సద్గుణ అడ్మిన్‌గా గ్రూపు ఏర్పాటు చేసింది. తన స్నేహితులందరినీ గ్రూపులో చేర్పిస్తూ వచ్చింది. ఐదుగురితో ప్రారంభమైన వాట్సప్ గ్రూపులో ప్రస్తుతం 127 మంది సభ్యులున్నారు. వయస్సు, లింగభేదం లేకుండా చిన్న పిల్లల నుండి సీనియర్ సిటిజన్ల వరకు ఉన్నారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, గోదావరిఖని, కరీంనగర్, ఆదిలాబాద్, నిర్మల్, చెన్నూర్, హైదరాబాద్, కోరుట్ల, నిజామాబాద్, ఆర్మూర్, మహారాష్ట్రలోని చంద్రపూర్‌తో పాటు విదేశాలకు చెందిన వారు సైతం గ్రూపులో ఉన్నారు. నేడు జిల్లా కేంద్రంలోని సత్యసాయి సదన్‌లో గ్రూపు ఐదో వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల్లో ఉండే గ్రూపు సభ్యులంతా హాజరుకానున్నారు.

నిత్యం పాటలతో..

ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రూపులో పలువురు గాయనీ గాయకులు పాటలతో అలరిస్తున్నారు. ఉదయం గ్రూపు అడ్మిన్ ఓ పదంతో పాటలు, పద్యాలు పాడే టాస్క్ ఇస్తారు. దీనిపై సాయంత్రం వరకు గ్రూపు సభ్యులు పాటలు పాడుతూ ఆనందంగా గడుపుతున్నారు. ఏటా ఏకాదశి పర్వదినాన గ్రూపులో సామూహిక భగవద్గీత పారాయణం చేస్తారు. గ్రూపు సభ్యుల పుట్టిన రోజు, పెళ్లిరోజు సంబరాలు జరుపుకుంటున్నారు. అంతేకాకుండా అత్యవసర పరిస్థితుల్లో ఆపదలో ఉన్న పేదలకు ఆర్థికసాయం అందిస్తూ మానవత్వం చాటుకుంటున్నారు. దీంతో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రూపు సభ్యులంతా తమ ఇళ్లలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం.

ఐదేళ్లుగా ప్రతీరోజు క్విజ్

పాటలతో ప్రారంభమైన ఈ వాట్సాప్ గ్రూపులో ప్రతిరోజు రాత్రి 7.00 గంటల నుండి 7.30 గంటల వరకు క్విజ్ నిర్వహిస్తున్నారు. రామాయణం, మహాభారతం, భాగవతం, ఆధ్యాత్మికతతో పాటు జనరల్ నాలెడ్జ్‌పై నిర్వహించే క్విజ్‌లో ఎన్నో తెలియని విషయాలు తెలుసుకుంటున్నారు. అడ్మిన్ సద్గుణతో పాటు జిల్లా కేంద్రానికి చెందిన సిర్ప దిలీప్ నిత్యం క్విజ్ నిర్వహిస్తున్నారు. ఐదేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. పండగలు, పర్వదినాలతో పాటు ప్రముఖుల జయంతి, వర్ధంతుల సందర్భంగా క్విజ్ నిర్వహిస్తూ గ్రూపు సభ్యులకు వర్తమాన విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు.

సేవా కార్యక్రమాలు



కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థికసాయం అందిస్తూ

కోవిడ్ సమయంలో ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపెల్లిలో రూ.25 వేలతో వందమందికి పైగా ఆదివాసీ గిరిజనులకు నిత్యావసరాల కిట్లు అందించారు. గోదావరిఖనిలో నిరుపేద యువతి రమ్య వివాహానికి రూ.10 వేలు, జిల్లా కేంద్రానికి చెందిన ఓ కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి డయాలసిస్ కోసం రూ.5 వేలు, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కాళీమాత అమ్మవారి ఆలయానికి గ్రూపు ద్వారా రూ.10 వేలు, గోదావరిఖనికి చెందిన ఓ అర్చకుడికి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. దీంతో పాటు సందర్భోచితంగా మానవతా దృక్పథంతో ఆదుకుంటున్నారు.

ఐదుగురితో ప్రారంభించాం



ఐదుగురితో వాట్సాప్ గ్రూపు ప్రారంభించాం. ప్రస్తుతం 127 మంది సభ్యులు ఉన్నారు. పుట్టిన ఊరి సహచరులను కలిపేందుకు ఏర్పాటు చేసుకున్న 'ఆసిఫాబాద్ అమృత స్వరాలు' ఐదేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతోంది. ఆధ్యాత్మికత, భక్తితో పాటు సేవా కార్యక్రమాలు, ప్రతిరోజు క్విజ్ నిర్వహిస్తున్నాం.

– కేశెట్టి సద్గుణ, గ్రూపు అడ్మిన్, గోదావరిఖని

పాటలతో ఆనందం



ఆసిఫాబాద్ అమృత స్వరాలు గ్రూపులో పాటలు పాడుతూ ఉత్సాహంగా గడుపుతున్నాం. రోజూ నిర్వహించే క్విజ్ వల్ల అనేక కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం. సభ్యుల్లో ఆధ్యాత్మిక భావనతో పాటు స్నేహభావం పెంపొందుతుంది.

– అనంత లక్ష్మి, గ్రూపు సభ్యురాలు, ఆసిఫాబాద్

చాలా ఎంజాయ్ చేస్తున్నా



గ్రూపు ప్రారంభం నుంచి ఉన్నా. ప్రతి రోజూ పాటలు పాడటం అలవాటైంది. సభ్యుల ప్రోత్సాహంతో పాటలపై మరింత ఉత్సాహం పెరిగింది. మ్యూజిక్ నేర్చుకుంటున్నా. ఏళ్లుగా విడిపోయిన మిత్రులను కలుసుకునే అవకాశం లభించింది. చాలా ఎంజాయ్ చేస్తున్నా.

– కొటారపు అంజలి, గ్రూపు సభ్యురాలు, హైదరాబాద్

ఐదేళ్లుగా పాల్గొంటున్నా



ఐదేళ్లుగా అమృత స్వరాల గ్రూపులో పాల్గొంటున్నా. ఉదయం దైవనామ స్మరణతో ప్రారంభమై రాత్రి పవళింపు పాటతో గ్రూపు ముగుస్తుంది. ప్రతి రోజూ క్విజ్, పాటలతో ఆనందంగా గడుపుతున్నాం. మిత్రులతో ముచ్చటించుకుంటున్నాం.

– మంచాల పద్మ, కోరుట్ల, గ్రూపు సభ్యురాలు

ఒకేచోట ఉన్న అనుభూతి



గ్రూపులో ప్రతిరోజూ రాత్రి 7.00 గంటలకు క్విజ్ నిర్వహిస్తాం. రామాయణ, మహాభారతం ఆధ్యాత్మిక, భక్తికి సంబంధించిన అంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్‌పై నిర్వహించే క్విజ్‌లో సభ్యులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. స్నేహితులు, బంధువులు ఒకేచోట ఉన్నటువంటి అనుభూతి కలుగుతుంది.

– సిర్ప దిలీప్, గ్రూప్ సభ్యుడు, ఆసిఫాబాద్

జాతీయభావం పెంపొందేలా చిత్ర ప్రదర్శన

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జాతీయ భావం పెంపొందేలా జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర ప్రదర్శన జరగుతుందని కలెక్టర్ హేమంత్ బోర్కడే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14 నుండి 24 వరకు జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర ప్రదర్శన జరుగుతుందని, విద్యార్థులను థియేటర్‌ల వద్దకు తీసుకెళ్లి తిరిగి వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్పించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం కోసం అహింసా మార్గంలో నిరంతర పోరాటం చేసిన జాతిపిత జీవిత చరిత్రను తెలియజేసే చిత్రాన్ని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, సాధారణ ప్రజలు కూడా వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 14న ఉదయం 8 గంటల నుండి 11.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన, 15న స్వాతంత్ర్య దినోత్సవం, 20న ఆదివారం చిత్ర ప్రదర్శనకు సెలవు ఉంటుందన్నారు. 16 నుండి 24 వరకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని, జిల్లాలోని ప్రజలు ఈ చిత్రాన్ని తిలకించి జాతీయతా భావం చాటాలన్నారు.

బీసీలందరికీ 'బీసీబంధు' ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

దహెగాం: బీసీ కులస్తుందరికీ బీసీబంధు పథకం వర్తింపజేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొంగ సత్యనారాయణ డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్ పిలుపు మేరకు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అంతకుముందు అంబేద్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలలో 112 కులాలు ఉంటే సీఎం కేసీఆర్ కేవలం 15 కులాలకే బీసీబంధు వర్తింపజేస్తూ మిగతా కులాలపై వివక్ష చూపుతున్నారన్నారు. బీసీ కులవృత్తులకు రూ.లక్ష సాయం అందిస్తామని ప్రకటించి నేటికీ ఇవ్వలేదన్నారు. బీసీలంతా ఏకమై కేసీఆర్‌ను గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోలేం వెంకటేశం, జిల్లా అధ్యక్షుడు చప్పిడి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యుడు పుల్గం నారాయణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పు ప్పాల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, నాయకులు పడాల సురేష్, సోషల్ మీ డియా కన్వీనర్ తుమ్మిడె సురేష్ , చప్పిడి సంజీవ్, రాపర్తి ప్రదీప్, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం యూఎస్‌పీసీ(ఉపాధ్యాయుల పోరాట కమిటీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. సీపీఎస్ రద్దు, నూతన పీఆర్‌సీ, ఐఆర్ అమలు, పాత పెన్షన్ విధానం అమలు, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకోసం సెప్టెంబర్1న హైదరాబాద్‌లో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందులాల్, హేమంత్, ఊశన్న, రమేశ్, తిరుపతి, చంద్రయ్య, మహేష్, మారుతి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

'27న మహాసభ విజయవంతం చేయాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: కాగజ్‌నగర్‌లోని సంతోశ్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న సీఐటీయూ ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని నాయకులు ముంజం శ్రీనివాస్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని అన్నిరంగాల కార్మికులు, ఉద్యోగులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు లోకేష్, ఓదెలు, రాజేందర్, ఇతర రంగాల కార్మికులు పాల్గొన్నారు.

ఆందోళన బాటలో రెండో ఏఎన్‌ఎంలు

- ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మె
- జిల్లా వ్యాప్తంగా 160 మంది సిబ్బంది
- 15 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలోనే..



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు (ఫైల్)

తిర్యాణి: వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా వారికి వైద్యసేవలందిస్తున రెండో ఏఎన్‌ఎంల సమస్యలు మాత్రం నేటికీ తీరడంలేదు. కరోనా సమయంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వైద్యసేవలందించి ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. అయినప్పటికీ తమకు ఉద్యోగ భద్రత లేకుండా పో యిందని, చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

15 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలోనే..

జాతీయ ఆరోగ్య మిషన్, యూరోపియన్ కమిషన్ స్కీం ద్వారా 2008లో జిల్లా వ్యాప్తంగా 160 మంది రెండో ఏఎన్‌ఎంలు కాంట్రాక్టు పద్ధతిలో నియామకమయ్యారు. 15 ఏళ్లుగా సేవలందిస్తున్నా రెగ్యులర్ ఏఎన్‌ఎంల మాదిరి యూనిఫాం, అలవెన్స్, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందితే కనీసం ఎక్స్‌గ్రేషియా కూడా ఇవ్వడంలేదని వాపోతున్నారు. తమ సమస్యలు పరిష్కరించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాటకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 11న జిల్లాలోని ప్రధాన కూడళ్ల వద్ద మానవహారం, 12న ప్రధాన కూడళ్ల వద్ద వంటావార్పు, 14న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేయడంతో పాటు ఈ నెల 16 నుంచి కలెక్టరేట్ ఎదుట నిరవదిక సమ్మె చేపట్టనున్నట్లు స్పష్టం చేస్తున్నారు.

ఆన్‌లైన్ విధులతో సతమతం..

రెండో ఏఎన్‌ఎంలు గ్రామాల్లో అనేక రకాల వైద్య సేవలందిస్తున్నారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు దాదాపు 20 రకాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. దీంతో పాటుగా వారి ఇళ్లకు వెళ్లి తగిన వైద్య సేవలందించాలి. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలి. డెంగీ, మలేరియా బాధితుల వివరాలు నమోదు చేసుకుని వారికి వైద్యసేవలందించాలి. కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం కావడంలోనూ వీరి పాత్ర ఎంతో కీలకం.

ప్రధాన డిమాండ్లు

- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.
- 1,520 ఏఎన్‌ఎం పోస్టుల భర్తీ కోసం గత నెల 26న ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలి.
- ఖాళీగా ఉన్న పోస్టులను అర్హత, సీనియారిటీ ఆధారంగా రెండో ఏఎన్‌ఎంలతో భర్తీ చేయాలి.
- రూ.25 లక్షల ప్రమాద బీమాతో పాటు ఈఎస్ఐ వర్తింపజేయాలి.
- సర్వీసులో ఉన్న సమయంలో మృతి చెందిన బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.

నోటిఫికేషన్ రద్దుచేయాలి



ఏఎన్‌ఎం ఖాళీల భర్తీ కోసం గత నెల 26న ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలి. ఆ పోస్టులను అర్హులైన రెండో ఏఎన్‌ఎంలతో భర్తీ చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలి.

– పుణ్యవతి, బాబాపూర్

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ఆరోగ్య పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సక్సెస్ చేస్తున్నాం. మా కష్టాలను గుర్తించి మమ్మల్ని క్రమబద్ధీకరించాలి.

– సంతోశి, పంగిడిమాదర, తిర్యాణి

16 నుంచి నిరవధిక సమ్మె

రెండో ఏఎన్‌ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దశల వారీ పోరాటాలు నిర్వహిస్తాం. రెండో ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్‌తో ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నాం.

– బోగె ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

'ఆర్‌ఎస్పీ'ని నిర్బంధించడం అప్రజాస్వామికం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్‌లోని గన్‌పార్కు వద్ద శాంతియుతంగా సత్యాగ్రహ దీక్ష చేపట్టేందుకు యత్నించిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు నిర్బంధించడం అప్రజాస్వామికమని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. ఇందుకు నిరసనగా శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షను అభ్యర్థుల సూచనల మేరకు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. నక్క మనోహర్, ముక్తియార్ రూమి, తిరుపతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లూర్ గ్రామంలో జరిగిన దాడి ఘటనలో నలుగురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. గ్రామానికి చెందిన గోమాసి ప్రభాకర్, అతని కుటుంబసభ్యులపై శుక్ర వారం రాత్రి బెజ్జూర్ మండలంలోని నలుగుపల్లి గ్రామానికి చెందిన సెగ్యం శేఖర్, సెగ్యం తిరుపతి, సెగ్యం రాజు, సెగ్యం వెంకటేశ్ దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఆయన వివరించారు.

ఆటోను ఢీకొట్టిన బొలేరో వాహనం


నుజ్జునుజ్జయిన ఆటో

భీమిని: అతివేగంగా, అజాగ్రత్తగా బొలేరో వాహనం వచ్చి ఢీకొనడంతో ఆటో నుజ్జునుజ్జు కాగా ట్రాక్టర్ ఇంజిన్ దెబ్బతింది. ఈ సంఘటన మండలంలోని వీగాం బస్టాండ్ వద్ద చోటు చేసుకుంది. మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన బొలేరో వాహనం పాముకాటుకు గురైన గట్టం రాజశేఖర్‌ను తీసుకొని కొంచెల్లికి వెళ్తుండగా వీగాం వద్ద ఆటోతోపాటు ట్రాక్టర్‌ను సైతం ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయి డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఆయిళ్ల సైమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న యువకుడి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు అనుదీప్

బెల్లంపల్లి: గంజాయిని అక్రమంగా రవాణా చేసి అమ్మకాలు సాగిస్తున్న ఓ యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులను చూసి బాల్మీకి అనుదీప్ పారిపోయేందుకు యత్నించాడు. పట్టుకుని తనిఖీ చేయడంతో బ్యాగులో గంజాయి ప్యాకెట్లు లభించాయి. 500 గ్రాముల వరకు ఉంటుందని అంచనా వేశారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో మహారాష్ట్రలోని బల్లర్షా నుంచి గంజాయిని కొనుగోలు చేసి బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలోని యువకులకు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

ఈవీఎం తెలుసు..!

సండే స్పెషల్

శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లపై అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తోంది. ఓటింగ్‌లో కచ్చితత్వానికి వినియోగిస్తున్న వీవీ పాట్‌లపైనా వివరిస్తోంది. ఈవీఎంలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో చెల్లని ఓట్లకు చెక్ పడింది. భారీయెత్తున కాగితం వినియోగమూ తగ్గింది. – సాక్షి, మంచిర్యాల డెస్క్

- ఎన్నికల నిర్వహణలో కీలకం
- చెల్లని ఓట్లకు చెల్లు చీటి
- ఓటింగ్‌లో కచ్చితత్వానికి వీవీ ప్యాట్
- ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓటు కచ్చితత్వం



ఓటు కచ్చితత్వానికి వీవీ ప్యాట్(ఓటరు వెరిఫైయేబుల్ పేపర్ ఆడిట్ (ట్రయల్) వినియోగిస్తున్నారు. ఓటు వేయగానే ఒక స్లిప్‌పై సీరియల్ నంబరు, అభ్యర్థి పేరు, గుర్తు ప్రింట్ అయి బాక్సులో పడుతుంది. 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంల్లో 315కోట్ల ఓట్లు పోలయ్యాయి.

ఒకే ఎన్నిక.. 25వేల బ్యాలెట్ యూనిట్లు

2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంటు స్థానానికి అత్యధికంగా 185మంది బరిలో నిలిచారు. పార్లమెంటు నియోజకవర్గంలోని 1,788 పోలింగ్ కేంద్రాల్లో మొత్తంగా 25వేల బ్యాలెటింగ్ యూనిట్లు, 2000 కంట్రోల్ యూనిట్లు, 2000 వీవీప్యాట్లు వినియోగించి ఎన్నిక నిర్వహించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 12బ్యాలెట్ యూనిట్లు, ఒక కంట్రోల్ యూనిట్, ఒక వీవీ ప్యాట్ అమర్చారు. రికార్డు స్థాయిలో అభ్యర్థులు బరిలో నిలిచినా ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించడం దేశంలోనే ఇది మొదటిసారి.

ఇలా మొదలై..


బ్యాలెట్ బాక్సు, పేపర్ స్థానంలో ఈవీఎం తీసుకురావడానికి ఎన్నికల సంఘం 1977లో హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్)ను సంప్రదించింది. దీంతో 1979లో నమూనా ఈవీఎంను రూపొందించింది. దీన్ని ఎన్నికల సంఘం 1980 ఆగస్టు 6న రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రదర్శించింది. ప్రభుత్వ రంగంలోని మరో సంస్థ బెంగళూర్‌లోని భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్(బెల్)తో కలిసి ఈసీఐఎల్ ఈవీఎలను తయారు చేసింది.

వినియోగంలోకి..

1982లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఈవీఎంలను మొదటిసారి వినియోగించారు. కానీ వినియోగానికి సంబంధించి నిర్దిష్ట చట్టం లేకపోవడంతో ఆ ఎన్నికలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఎన్నికల్లో ఈవీఎంల వినియోగానికి సంబంధించి ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని పార్లమెంటులో 1989లో సవరించారు. ఆ తర్వాత 1998లో మధ్యప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లోని 25 శాసనసభ నియోజకవర్గాల్లో ఈవీఎంలను వినియోగించారు. 1999 ఎన్నికల్లో 45 పార్లమెంటరీ స్థానాల్లో, 2000లో హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 45 అసెంబ్లీ స్థానాల్లో వినియోగించారు. 2001లో తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, పశ్చిమబంగాల్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఈవీఎంలను ఉపయోగించారు. అప్పటి నుంచి ప్రతీ ఎన్నికల్లో ఎన్నికల సంఘం ఈవీఎంలనే వినియోగిస్తోంది. 2004లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో దేశంలోని 543 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఈవీఎంలు వినియోగించారు.


అవగాహన కల్పించే నమూనా ఈవీఎం

ఎప్పటికప్పుడు మార్పులు


బ్యాలెటింగ్ యూనిట్

ఈవీఎంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెటింగ్ యూనిట్ ఉంటాయి. ఐదు మీటర్ల కేబుల్‌తో ఈ రెండింటిని అనుసంధానం చేస్తారు. బ్యాలెటింగ్ యూనిట్‌లో 16 మంది అభ్యర్థుల గుర్తులు, పేర్లుంటాయి. 2006 కంటే ముందు ఎం1, ఆ తర్వాత ఎం2 ఈవీఎంలు ఉండగా.. నాలుగు బ్యాలెటింగ్ యూనిట్లను అనుసంధానం చేయడం ద్వారా గరిష్టంగా 64 మంది(నోటాతో కలిపి) అభ్యర్థులు బరిలో ఉన్నా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. 2006 తర్వాత ఎం3 ఈవీఎంలను తయారు చేయగా.. 24 బ్యాలెటింగ్ యూనిట్లను అనుసంధానం చేయడం ద్వారా గరిష్టంగా నోటాతో కలిపి 384 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా ఎన్నికలు నిర్వహించవచ్చు. ఒకే కంట్రోల్ యూనిట్ అవసరం అవుతుంది.

కలెక్టరేట్లలో అవగాహన

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఆసిఫాబాద్, సిర్పూర్ ఉన్నాయి. ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లలో ఈవీఎంలను ప్రదర్శిస్తూ సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

పెండింగ్ కేసుల వివరాలు పరిశీలించాలి


మాట్లాడుతున్న డీజీఎం అరవిందరావు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని గనుల పెండింగ్ కేసుల వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని డీజీఎం(పర్సనల్) అరవిందరావు సూచించారు. శనివారం ఆయన ఏరియా సంక్షేమ అధికారులు, లా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ ఏరియాలో పని చేస్తున్న ఉద్యోగుల క్యాడర్‌స్కీంకు సంబంధించిన అంశాలను ఉద్యోగులకు తెలియజేయాలని అన్నారు. డిపెండెంట్ ఎంప్లాయిమెంట్‌కు సంబంధించిన అంశాలు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఖాతాలను ఫార్మర్ లేదా సర్వైవర్ ఖాతాలుగా మార్చుకోవడానికి సూచనలు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవై పీఎంలు వీ.రాజేశ్వర్‌రావు, వీ.దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజు, సంక్షేమ అధికారులు సునీల్, రణదీప్‌గౌడ్, గౌస్‌పాషా, సంతన్, పాల్‌సృజన్, అజ్మీర రమేశ్, సీనియర్ లా ఆఫీసర్ పాల్గొన్నారు.

కేబీ థియేటర్ వద్ద ఆందోళన


థియేటర్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రేక్షకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేబీ థియేటర్ వద్ద శనివారం నిర్వాహకులకు, ప్రేక్షకుల మధ్య మాటల యుద్ధం నెలకొంది. ప్రస్తుతం ఇక్కడి థియేటర్‌లో మెగాస్టార్ చిరంజీవి నటించిన భోళా శంకర్ సినిమా నడుస్తోంది. మధ్యాహ్నం 2.30 గంటలకు షోను రెండవ భాగం వేసి కేవలం గంటలోపే సినిమాను పూర్తి చేయడంపై ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ టికెట్ల డబ్బులు తిరిగి ఇవ్వాలని ప్రేక్షకులు డిమాండ్ చేయగా ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు ఇవ్వమని, కావాలంటే మొదటి భాగం తిరిగి వేస్తామని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ప్రతిరోజు ఇలానే ఏదో సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రేక్షకులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి థియేటర్ సక్రమంగా నడిచేలా చర్యలు చేపట్టాలని ప్రేక్షకులు కోరుతున్నారు.

కాంట్రాక్టు కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్: రెండేళ్లుగా పవర్ ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించినప్పటికీ పరిష్కారం కాలేదని, కార్మికుల సమస్యలు పరిష్కారం కాని పక్షంలో సమ్మెకు సిద్ధం కావాలని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో కార్పొరేట్ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారం చూపాలని తెలిపారు. స్థానిక భూనిర్వాసిత, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, లేని పక్షంలో సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి విక్రం, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, సెక్రెటరీ సాయికృష్ణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ చిప్పకుర్తి సంపత్, ఎలుక రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు రామగిరి మల్లేశ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై కుక్కల దాడి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని కౌసర్‌నగర్ (14వ వార్డు)లో శనివారం సాయంత్రం కుక్కలు దాడి చేయడంతో అస్గర్ అనే బాలునికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇటీవల కాలంలో పట్టణంలోని పలు వార్డుల్లో పిచ్చి కుక్కల స్వైర విహారం పెరిగిందని, అధికారులకు సమాచారం అందించినప్పటికీ నివారణ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నివారణ కోసం చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గనులు సందర్శించిన అధికారులు



ఆర్‌కే 6 గని వద్ద అధికారులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 6, ఆర్‌కే 5, ఆర్‌కే7 గనులను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్, థర్డ్ పార్టీ మైన్స్ వెరిఫికేషన్ కమిటీ అధికారులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు భూగర్భ గనుల పరిసర ప్రాంతాల్లో పెంచుతున్న మొక్కలు, ఫిల్టర్‌బెడ్ నిర్వహణ అంశాలను పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సుదీప్త ముఖోపాధ్యాయ, ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్, శ్రీరాంపూర్ ఏరియా ఎన్విరాల్‌మెంటల్ అధికారి హనుమాన్‌గౌడ్, కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ అడిషనల్ మేనేజర్లు తిరుపతి, బాబ్జీ, డిప్యూటీ మేనేజర్ పోచమల్ల, ఎస్ఓఎం తిరుపతి, గని రక్షణ అధికారి కే.శ్రీనివాస్, సర్వే అధికారి ఎస్‌పి.వర్మ, తదితరులు పాల్గొన్నారు.


రైల్వే ఆదాయం ఆన్‌లైన్‌లో ఆటాడేశాడు..!

- రూ.34.16లక్షలు హుమకాకి
- బెల్లంపల్లిలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకం

బెల్లంపల్లి: అతడు రైల్వేస్టేషన్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి. రోజువారీగా టికెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని సంబంధిత బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. కానీ.. రోజూ వేలాది రూపాయలు చేతిలో కనిపిస్తుండడంతో ఆలోచన వక్రమార్గం పట్టింది. రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఆదాయాన్ని ఆన్‌లైన్‌లో తీన్‌పత్తి, క్యాసినో గేమ్ ఆడేశాడు. ఏకంగా రూ.34.16లక్షలు పోగొట్టడం రైల్వే అధికారులు, ఇన్ఫోసిస్ క్యాష్ మేనేజ్‌మెంట్ సిస్టం ప్రైవేటు లిమిటెడ్ నిర్వాహకులను నివ్వెరపరిచింది. రైల్వే టికెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని రోజువారీగా పలు రైల్వేస్టేషన్ల వారీగా సేకరించి సంబంధిత బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ఇందుకు గాను రైల్వే శాఖ ఆ విభాగాన్ని ఇన్ఫోసిస్ క్యాష్ మేనేజ్‌మెంటు సిస్టం ప్రైవేటు లిమిటెడ్‌కు కట్టబెట్టింది. బెల్లంపల్లి ప్రాంతంలోని పలు రైల్వేస్టేషన్లలో టికెట్ల ఆదాయాన్ని సమీకరించి బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేయడానికి అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన బెల్లంపల్లి రైల్వే కాలనీకి చెందిన బడే శ్రీపతిబాబు ఉద్యోగం చేస్తున్నాడు. కొంతకాలంపాటు నమ్మకంగా పని చేసి ఆ తర్వాత అందులో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని డబ్బు స్వాహా చేశాడు. రోజువారీ ఆదాయాన్ని బ్యాంకులో జమ చేయకుండా నకిలీ స్టాంప్‌లు తయారు చేసి వోచర్లపై ముద్రవేసి బ్యాంకులో జమ చేసినట్లుగా వాటిని కరీంనగర్ బ్రాంచ్ అధికారులకు పంపించేవాడు. దక్షిణ మధ్య రైల్వే కమర్షియల్ అధికారుల లెక్కల్లో భారీగా తేడా రావడంతో గుట్టుగా ఆరా తీసి మోసాన్ని గుర్తించారు. ఇన్ఫోసిస్ క్యాష్ మేనేజ్‌మెంటు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిందితుడు శ్రీపతిబాబును బెల్లంపల్లి టూటౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా, రైల్వే టికెట్ల ఆదాయాన్ని నిందితుడు శ్రీపతిబాబు ఆన్‌లైన్ ఆటల్లో పోగొట్టినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడే అలవాటు ఉందని, తీన్‌పత్తి, క్యాసినోతోపాటు బిట్‌కాయిన్‌లో రూ.32లక్షలు పోగొట్టుకున్నానని చెప్పినట్లు తెలుస్తోంది. నిందితుడి స్థిర, చరాస్తులపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో మరెన్ని అంశాలు వెలుగు చూస్తాయో వేచి చూడాల్సిందే.

సైబర్ వలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

- రూ. 1.70 లక్షలు నష్టపోయిన వైనం



సైబర్ నేరగాళ్లకు ఫోన్‌పే ద్వారా పంపించిన నగదు

కౌటాల: నిరక్షరాస్యులతో పాటు అక్షరాస్యులు కూడా సైబర్ నేరగాళ్ల వలలోపడి మోసపోతున్నారు. బెజ్జూర్ మండలంలోని కుంటాలమానెపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు నైతం లతశ్రీ కౌటాల మండలంలోని ఇప్పలగూడ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తోంది. ఫేస్‌బుక్‌లో వచ్చిన వ్యాపార ప్రకటనలోని ఫోన్ నంబర్లను సంప్రదించింది. ధనీ బ్యాంకు పేరుతో 9038683321 నంబర్ నుంచి ఆమెకు ఫోన్ వచ్చింది. ఈ నెల 2న రూ.50 లక్షల రుణం మంజూరు చేస్తున్నట్లు ఫోన్‌ద్వారా సందేశం పంపించారు. దీంతో పాటు సైబర్ నేరగాళ్లు ఆధార్, పాన్‌కార్డుతో పాటు ఆమె ఖాతా నంబర్ కలిగిన రూ.50 లక్షల బ్యాంకు చెక్కు వంటి తప్పుడు ధ్రువీకరణ పత్రాలను వాట్సాప్ ద్వారా పంపించారు. వివరాలను పోల్చి చూసిన బాధితురాలు వారిని నమ్మి లావాదేవీలు జరిపారు. ఆగస్టు 2 నుంచి 11వ తేదీ వరకు పలు దఫాలుగా రూ.1.70 లక్షల నగదును పేటీఎం, ఫోన్‌పేల ద్వారా చెల్లించారు. మరిన్ని చార్జీలు చెల్లిస్తేనే రూ.50 లక్షల రుణం మీ ఖాతాలో జమ అవుతుందని సదరు వ్యక్తులు తెలపడంతో అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించారు. కౌటాల ఎస్సై మధుకర్, సీఐ సాధిక్‌పాషాలకు ఫిర్యాదు చేయడంతో సైబర్ విభాగంలో ఫిర్యాదును నమోదు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ర్యాలీలో నాయకులు, ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నేతలు డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని, పీఆర్‌సీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. జూలై 1నుంచి ఐఆర్ అమలు చేయాలన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ జిల్లా నాయకులు గోళ్ల రామన్న, గుర్రాల రాజావేణు, రమేష్, మోతే జయకృష్ణ, లక్ష్మణ్, విష్ణు, కిరణ్, దిలీప్, విజయ్, సాయిబాబు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శనివారం పట్టణంలోని నీలకంఠేశ్వరరావు ఆస్పత్రి ఆవరణలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆత్మకూరి మల్లిఖార్జున్, ఉపాధ్యక్షులుగా బొల్లం రంజిత్‌కుమార్, మడుగుల స్వామి, ప్రధాన కార్యదర్శిగా రేచవేణి సదన్, సంయుక్త కార్యదర్శులుగా బద్రి గోపికృష్ణ, మంచిర్యాల మల్లన్న, ప్రేమలత, కోశాధికారిగా పున్నం పాదం, ప్రచార కార్యదర్శి గడిల విజయ్, టి.సన్నీ, ఎం.జోత్స్న, కార్యవర్గ సభ్యులుగా కాసిపేట స్వామి, గొడిసెల నవీన్, రాజేష్, శ్యామ్ ఎన్నికయ్యారు. సినిమా, యూట్యూబ్ రంగాల్లో ఆర్టిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని కార్యవర్గం ప్రకటించింది. మంచిర్యాల జిల్లాలోని మూవీ, యూట్యూబ్ ఛానల్స్ ఆర్టిస్ట్ అసోసియేషన్ కళాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులపట్ల హెచ్‌ఎం అసభ్యకర ప్రవర్తన


మాట్లాడుతున్న జెడ్పీటీసీ పుష్పలత

బెజ్జూర్: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన ఓ ప్రధానోపాధ్యాయుడు వారి పాలిట శాపంగా మారాడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థిరాం ఈ నెల 9న రాత్రి సమయంలో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం బయటికి వస్తే సమాజంలో తమ పరువు పోతుందని సదరు విద్యార్థిని తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడినట్లు సమాచారం. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు పార్థిరాంను 'సాక్షి' సంప్రదించగా నాపై కావాలనే ఇలా చేస్తున్నారని, తొమ్మిది, పదో తేదీల్లో నేను పాఠశాలలో అందుబాటులో లేనని, తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడుతున్న హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, విద్యాకమిటీ చైర్మన్ లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చాలాకాలంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నప్పటికీ ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమావేశంలో గిరిజన నాయకులు సిడాం సకారాం, తిరుపతి, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఈపీ-2020 రద్దు చేయాలి

మంచిర్యాలఅర్బన్: నూతన విద్యావిధానం-2020 ద్వారా ప్రభుత్వం విద్యారంగాన్ని కేంద్రీకరణ, వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, కాషాయికరణ వైపు తీసుకెళ్లే ప్రయత్నాన్ని టీఎస్‌యూటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోళ్ల రామన్న అన్నారు. శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎస్‌టీఎఫ్ఐ 24వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ కార్యకర్త కైలాసం ఎస్‌టీఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు, కోశాధికారి కిరణ్, కార్యదర్శి కిరణ్‌కుమార్, కమిటీ సభ్యులు వాహిద్, తిరుపతి, రాములు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.